

ధారూరు జాతరకు భారీ ఏర్పాట్లు
అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష 6
మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో
తెలంగాణ తల్లి విగ్రహం

### బడికెళ్లకున్నా జీతం

తలకొండపల్లి మండలం పడకల్ జెడ్పీ హెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్)గా పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడి భార్య పొరుగున ఉన్న నాగర్ కర్నూల్ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్)గా విధులు నిర్వహిస్తున్నారు. స్పౌజ్ కోటాలో భర్త పనిచేస్తున్న ప్రాంతానికి ఆమె బదిలీ కోరుతూ జీవో 317 కింద దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనలకు అనుగుణంగా అప్పటికి ఉన్న ఖాళీ పోస్టుల ప్రకారం కౌన్సెలింగ్ ద్వారా ఆమెను తలకొండపల్లి మండలం ఖానాపూర్‌కు కేటాయించారు. కానీ ఆమె విధుల్లో చేరలేదు. తర్వాత ఏమైందో తెలియదు. కానీ 23 రోజుల అనంతరం ఆమెను గ్రామీణ ప్రాంతం నుంచి నగరంలోని సరూర్‌నగర్ మండలం రాజీవ్ గాంధీనగర్ పాఠశాలకు కేటాయిస్తూ సవరణ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి వరకు ఆమె ఎక్కడా ఉద్యోగం చేయలేదు. అయినా జీతభత్యాలు మాత్రం చెల్లించేశారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో జిల్లా విద్యాశాఖ నుంచి ఉపాధ్యాయురాలికి ఆన్‌డ్యూటీ సర్టిఫికెట్ జారీ చేసి సమర్థించుకున్నారు. ఇది కూడా బెడిసికొట్టడంతో ఆమెకు ఎలిజిబుల్ లీవ్ మంజూరు చేయాలని డీడీవో(డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్)కు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు అనుసరించి మెడికల్ లీవ్‌గా పరిగణించి జీతభత్యాలు చెల్లించారు. ఒకవైపు ఆన్ డ్యూటీ అని చెబుతూ మరో వైపు మెడికల్ లీవు ఇవ్వడం విద్యాశాఖ అధికారులకే చెల్లింది. ఇలా స్పౌజ్ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా 70కి.మీ దూరంలో జిల్లా విద్యాశాఖ అడ్డగోలుగా పోస్టింగ్ ఇచ్చేసింది. రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయుల బదిలీల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనడానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి బదిలీలు జిల్లాలో దొడ్డిదారిన కోకొల్లలుగా జరుగుతూనే ఉన్నాయి. గత కొన్నేళ్లుగా స్థానిక ఉపాధ్యాయులు, నిరుద్యోగుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా బదిలీలు, పదోన్నతులు చేపడుతున్నారు.

జిల్లా విద్యాశాఖ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారింది. అక్కడి అధికారులు 'ఆడింది ఆట పాడింది పాట' అన్న చందంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. జీవో 317 ప్రకారం నిర్వహించిన స్పౌజ్ బదిలీల్లో పెద్ద సంఖ్యలో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అనర్హులకు పెద్దపీట వేసి దొడ్డిదారిన పట్టణప్రాంతాలకు బదిలీలు చేశారు. విధులకు హాజరుకాకున్నా జీతభత్యాలు చెల్లిస్తూ ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం చేశారు. సంబంధిత సబ్జెక్ట్ పోస్టులు ఖాళీగా లేకపోయినా వారికి ఇష్టమైన చోట ఇతర సబ్జెక్ట్‌ల పోస్టుల్లో భర్తీ చేయడం గమనార్హం. దీంతో రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉపాధ్యాయుల ఖాళీ పోస్టుల సంఖ్య భారీగా తగ్గింది. దీంతో స్థానిక ఉపాధ్యాయులు, యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. జిల్లా విద్యాశాఖలో జరుగుతున్న అక్రమాలు, అవినీతిపై పరిశోధనాత్మక కథనం.



## స్పౌజ్ కోటా..

ఆంధ్రజ్యోతి పరిశోధన

# అందరికీ వాటా!

### జిల్లా విద్యాశాఖలో అవినీతి 'పాఠాలు'

**జీవో 317 పేరుతో భారీగా అక్రమాలు**

**స్పౌజ్ బదిలీల్లో అనర్హులకు పెద్దపీట**

**డీఈఓ కార్యాలయంపై ఫిర్యాదుల వెల్లువ**

**దొడ్డిదారిన పట్టణ ప్రాంతాలకు టీచర్లు**

**70 కిలోమీటర్ల పరిధిలో పోస్టింగ్**

**విధులకు హాజరుకాకున్నా జీతభత్యాలు**

**గ్రామీణ పాఠశాలలకు తీరని అన్యాయం**

**స్థానిక ఉపాధ్యాయులు, నిరుద్యోగులకు తీవ్ర నష్టం**

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): జిల్లా విద్యాశాఖలో కొంత కాలంగా జరుగుతున్న వివిధ రకాల బదిలీలు, పదోన్నతులు, డిప్యుటేషన్లకు సంబంధించి తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఉపాధ్యాయులు, నిరుద్యోగులకు కొన్నేళ్ల పాటు నష్టం జరిగే విధంగా అడ్డగోలు నియామకాలు చేపడుతున్నారు. ముఖ్యంగా స్పౌజ్ బదిలీల్లో అనర్హులకు పెద్దపీట వేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భార్యభర్తలు ఒకే చోట పని చేసేందుకు అవకాశం కల్పిస్తూ జీవో 317 ప్రకారం విద్యాశాఖలో స్పౌజ్ బదిలీలు చేపట్టిన విషయం తెలిసిందే. సాధారణంగా స్పౌజ్ బదిలీల్లో భాగస్వామి పని చేస్తున్న స్కూల్‌లో పోస్టు ఖాళీగా ఉంటే

మిగతా 7వ పేజీలో...







### భారీగా తగ్గిన ఖాళీలు

ఇష్టారీతిన బదిలీలు చేపట్టడంతో జిల్లాలో చివరకు పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే స్కూల్ అసిస్టెంట్‌లలో కొన్ని సబ్జెక్టులకు సంబంధించిన పోస్టులు అసలు ఖాళీనే లేకుండా పోయాయి. ఉదాహరణకు ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ టీచర్‌ను తీసుకొచ్చి ఎస్‌ఏ సోషల్ స్టడీస్ పోస్టులో, ఎస్‌ఏ మ్యాథ్స్ టీచర్‌ను ఎస్‌ఏ హిందీ పోస్టులో భర్తీ చేశారు. జీవో 317 ద్వారా జరిగిన కేటాయింపులు వల్ల (06/01/2022 - 04/10/2023) నాటికి ఎస్‌ఏ మ్యాథ్స్‌లో ఉన్న 44 ఖాళీల్లో కేవలం 3 మాత్రమే మిగిలాయి. అలాగే ఎస్‌ఏ బయోసైన్స్‌లో 103 ఖాళీలు ఉండగా ఇందులో 44, ఎస్‌ఏ ఇంగ్లిష్‌లో 52 ఖాళీలు ఉంటే కేవలం 15, ఎస్‌ఏ ఫిజిక్స్‌లో 14 ఖాళీలు ఉంటే చివరకు 5 పోస్టులు మాత్రమే మిగిలాయి.

### నిరుద్యోగులకు తీరని నష్టం

ఈ అక్రమ బదిలీల వల్ల స్థానిక ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లతో పాటు పదోన్నతుల్లోనూ ఎక్కువ నష్టం జరుగుతోంది. జిల్లా విద్యాశాఖ అక్రమ బదిలీలను ఆపకపోగా వాటిని ప్రోత్సహించిన తీరు అత్యంత విచారకరం. స్థానిక ఉపాధ్యాయులకు, నిబంధనలకు లోబడి వచ్చినవారితో పాటు, నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారు. పదోన్నతుల్లో దాదాపు 300 మంది స్థానిక ఉపాధ్యాయులకు నష్టం జరిగింది. అలాగే 800 ఉపాధ్యాయ ఖాళీలను రంగారెడ్డి జిల్లా నిరుద్యోగులు కోల్పోయారు. డీఎస్సీ 2024 నోటిఫికేషన్‌లో ఖాళీల సంఖ్య చూస్తే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతోంది. డీఈడీ, బీఈడీ చేసిన స్థానిక యువత పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది. 2018 నుంచి కొంతమంది ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిప్యుటేషన్, ఆన్ డ్యూటీ అని పలురకాల పేర్లు చెప్పుకుంటూ నేటికీ కొనసాగుతున్నారు. గత విద్యా సంవత్సరాలలో (2022-23, 2023-24) వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో, ఆన్ డ్యూటీ పేరుతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు అనేక మంది టీచర్లను డిప్యుటేషన్లపై బదిలీ చేశారు. ఈ అక్రమ డిప్యూటేషన్ల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని పలు పాఠశాలల్లో టీచర్లు లేక విద్యార్థులు రాకపోవడంతో చివరకు పాఠశాలలుగా మూతపడ్డాయి. ఇలాంటి చర్యల ఫలితంగా కేవలం ఒక్క కడ్తాల్ మండలంలోనే ఆరు పాఠశాలలు మూతపడడం గమనార్హం.

# గ్రీన్ సిగ్నల్!

### హైదరాబాద్- బీజాపూర్ హైవే నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

**అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 4లేన్ల రోడ్డు**

**చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లో బైపాస్ రోడ్డు**

**ఇప్పటికే భూ సేకరణ ప్రక్రియ పూర్తి**


హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి

చేవెళ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ప్రజల కళ త్వరలో నెరవేరబోతుంది. హైదరాబాద్-బీజాపూర్ (ఎన్‌హెచ్-163) జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులకు గ్రీన్ ట్రిబ్యునల్‌లో గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. దీంతో ఈ ప్రాంతవాసులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2015లో కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్డును జాతీయ రహదారిగా ప్రకటించింది. రూ.928.41 కోట్ల నిధులతో 46 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో టీఎస్‌పీఏ జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు (ఎన్‌హెచ్163) నిర్మించనున్న నాలుగు లేన్ల రహదారికి ఇరువైపులా ఉన్న మర్రి వృక్షాలను తొలగించొద్దంటు అప్పట్లో సేవ్ బనియన్స్ సంస్థకు చెందిన పర్యావరణ వేత్తలు గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేయడంతో పనులకు బ్రేక్ పడింది. అయితే ఎన్‌హెచ్ ఏఐ అధికారులు గ్రీన్‌ట్రిబ్యునల్ కోర్టుకు ప్రభుత్వ పరంగా నివేదిక సమర్పించడంతో సేవ్ బనియన్స్ సంస్థకు చెందిన పర్యావరణవేత్తలు కేసును విత్‌డ్రా చేసుకున్నారు. అయితే అక్టోబరు 31వ తేదీన గ్రీన్‌ట్రిబ్యునల్‌లో స్టే వికేట్ చేస్తూ రోడ్డు పనులు కొనసాగించవచ్చని తీర్పును ప్రకటించింది. దీంతో రోడ్డు విస్తరణకు మోక్షం లభించినట్లైంది.

**ఎన్‌హెచ్ 163 రహదారి వివరాలు**

- రహదారి పొడవు : 46 కి.మీ.
- సేకరించిన భూమి : 145.42 హెక్టార్లు
- నిర్మాణ వ్యయం రూ.928.41 కోట్లు
- అండర్‌పాస్‌లు : 18, బైపాస్‌లు : 02
- 765 మర్రి చెట్లను రక్షించేలా అలైన్‌మెంట్ మార్పు
- ఇప్పటికే 150 వృక్షాలు రీ లొకేట్

**జరిగిన ప్రమాదాలు..**

హైదరాబాద్ -బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు ఇరుకుగా ఉండడంతో గత ఐదేళ్లలో జరిగిన ప్రమాదాల్లో 250 మంది మృతిచెందగా, మరో 600మంది

మిగతా 7వ పేజీలో...

### 4 నుంచి జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు

మేడ్చల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): యువతలో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యువజన సంబరాలను చేపట్టనుంది. అందులో భాగంగా చదువుతో పాటు కళలు, ఆటల్లో యువతకు పోటీలు నిర్వహించనున్నారు. 4వ తేదీన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు ప్రారంభించనున్నారు. ఇందులో 15 నుంచి 29 ఏళ్లలోపు యువకులు పాల్గొననున్నారు. ఆసక్తి కలిగిన యువతీయువకులు నవంబర్ 3వ తేదీలోగా కలెక్టరేట్‌లోని జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 12వ తేదీ వరకు జాతీయ స్థాయిలో జరిగే వేడుకలకు పంపిస్తారు. జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో జానపద నృత్యం, జానపద పాటలు, కవిత్వం, వ్యాస రచన, పెయింటింగ్, ఉపన్యాసం, ఇన్నోవేషన్ తదితర పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు జిల్లా వాసులై ఉండాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి దామోదర్ రెడ్డి తెలిపారు.

### ప్రకృతి వ్యవసాయంతో
# సిరుల పంట

- యువ రైతు చంద్రశేఖర్‌రెడ్డి వినూత్న ఆలోచన
- దేశవాళీ ఆవుల ఎరువుతో సాగు
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

Sunday Special

ప్రస్తుతం పంటల సాగులో క్రిమిసంహారక మందుల వినియోగం పెరిగిపోయింది. తద్వారా ఖర్చులు అధికమై దిగుబడి తగ్గిపోతోంది. అయితే చేవెళ్ల మండలం ఇక్కరెడ్డిగూడ గ్రామానికి చెందిన యువరైతు గణపతి చంద్రశేఖర్‌రెడ్డి(రాజు) వినూత్నంగా ఆలోచించాడు. రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు అవసరం లేకుండానే ఏడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నాడు. రసాయనిక ఎరువులు వినియోగించకుండా దేశవాళీ ఆవుల పేడ, మూత్రంతో ఎరువు తయారు చేసి పంట పొలాలకు ఉపయోగిస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నాడు.

6



### మెడికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని యూపీహెచ్‌సీల్లో మూడు మెడికల్ ఆఫీసర్ పోస్టులు, హెచ్‌డబ్ల్యూసీలో ఎంఎల్‌హెచ్‌పీలో ఎనిమిది పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యూపీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్స్ పోస్టులకు ఎంబీబీఎస్, ఆయుష్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అలాగే ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన స్టాఫ్ నర్సులు (2020 విద్యా సంవత్సరం తర్వాత పట్టా పొందిన వారు) లేదా 2020 కంటే ముందు బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం పూర్తి చేసిన వారు, కమ్యూనిటీ హెల్త్‌లో 6 నెలల బ్రిడ్జి ప్రోగ్రామ్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. దరఖాస్తు పత్రాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుంచి నవంబరు 1 నుంచి 3వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని, డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తుతో అవసరమైన ధ్రువపత్రాలు, రూ.500ల డిమాండ్ డ్రాఫ్ట్ జత చేసి కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు.


# మత్స్యకారుల అభ్యున్నతికి కృషి


పెద్ద చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎంపీ ఈటల

**మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**

శామీర్‌పేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల కుటుంబాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహకారమందేలా కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. శనివారం శామీర్‌పేట పెద్ద చెరువులో చేప పిల్లలు వదిలే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మత్స్యశాఖ అధికారి సుకీర్తి, మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు రాజుతో కలసి చెరువులో చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 40 లక్షల మత్స్యకారుల జనాభా ఉందన్నారు. వీరంతా చేపల పెంపకం, మార్కెటింగ్‌పై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. గతంలో చెరువుల మీద కాంట్రాక్టర్ల పెత్తనం ఉండేదని, తెలంగాణ వచ్చిన తరువాత ఆ దుర్మార్గానికి స్వస్తి పలికి మత్స్యకారుల సొసైటీ మెంబర్లు మాత్రమే చెరువుల్లో చేపలు పట్టి మార్కెటింగ్ చేసే విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం భూములు ఇస్తే మత్స్యకార సొసైటీలకు తాను బాధ్యత వహించి మార్కెటింగ్ భవనాల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. హైదరాబాద్‌లోని చెరువులు మురికి కూపాలుగా తయారు అయ్యాయన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ హనుమంతరావు, డీఎఫ్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు మన్నె రాజు, ఉపాధ్యక్షుడు మోహన్‌క్రిష్ణ, డైరెక్టర్లు వెంకటేశ్, దేవేందర్, రాము, డీఎఫ్‌ఓ శ్రీకాంత్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, క్రిష్ణ ముదిరాజ్, సుదర్శన్, యాదగిరి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు పరిగిలో డిప్యూటీ సీఎం పర్యటన



పరిగి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం పరిగి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మండలంలోని నజీరాబాద్ శివారులో కొత్తగా ఏర్పాటు చేయనున్న 400 కేవీ సబ్‌సేబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాన చేయనున్నారు. అలాగే అక్కడే ఏర్పాటు చేసిన 220 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి రూ.8 కోట్ల విలువ చేసే విద్యుత్ పరికరాలను పంపిణీ చేస్తారు. పూడూరు మండలం గట్‌పల్లి, పరిగి మండలం నస్కల్, జాఫర్‌పల్లి, గోవిందాపూర్, దోమ మండలం గూడూరు, చౌడాపూర్ మండలం కొత్తపల్లిలో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. నజీరాబాద్ తండా దగ్గర బహిరంగ సభ ఉంటుందని తెలిపారు.

### సోమేశ్వర ఆలయ భూములు స్వాధీనం

తాండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తాండూరు మున్సిపల్ పరిధిలోని సోమేశ్వర ఆలయానికి సంబంధించిన భూములను శనివారం దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. పాత తాండూరు సర్వే నంబర్ 37లో 5.37ఎకరాల భూమి కొన్నేళ్లుగా అన్యాక్రాంతమైంది. కాగా, ఈ భూమిని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్నారు. ఇది ఎండోమెంట్ భూమిగా హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. ఎవరైన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎండోమెంట్ సీఈవో శేఖర్ తెలిపారు.

### 12లోపు సీఎంఆర్ అందజేయాలి

**వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్ల వద్ద ఉన్న సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)ను నవంబరు 12వ తేదీ లోపు అందజేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో సీఎంఆర్, బ్యాంకు గ్యారెంటీలు, అగ్రిమెంట్లు, తదితర అంశాలపై రైస్ మిల్లర్లు, పౌర సరఫరాల అధికారులతో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లు అందరూ బ్యాంకు గ్యారెంటీలతో పాటు అగ్రిమెంట్లను అందజేయాలన్నారు. జిల్లాలో ధాన్యం అంచనాలకు అనుగుణంగా మిల్లర్లు సిద్ధంగా ఉండాలని తెలిపారు. త్వరలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బాలేశ్వర్ గుప్తా, బాదాం శ్రీనివాస్, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లు, పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న గోపాల్‌నాయక్

కడ్తాల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, జిల్లా నాయకుడు జంగయ్య కోరారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను అమలు చేయాలని, జీవో నం.190 ప్రకారం డిప్యుటేషన్లు ఇవ్వాలని, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. ఆయా సమస్యలను త్వరగా పరిష్కరించాలని డీఈవోను కోరినట్లు గోపాల్‌నాయక్ తెలిపారు.



## ప్రకృతి వ్యవసాయంతో సిరుల పంట

చేవెళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం అంటే భూమిలోని సూక్ష్మజీవులు, వాన పాముల ద్వారా పంటలకు అవసరమైన పోషకాలను అందించడం. వీటిని వృద్ధి చేయడం ద్వారా పంటలు బాగా పండుతాయి. ఆవుపేడ, మూత్రంతో జీవామృతం తయారు చేసి చల్లితే అది భూమిలో నిక్షిప్తమై పోషకాలను మొక్కలకు అందిస్తుంది.

**ఒక్క దేశి ఆవుతో ఇలా...**

ఒక దేశవాళి ఆవు ఉంటే దాదాపు 30 ఎకరాల్లోని పంటలకు ఎరువును అందించవచ్చు. ఆవు ఎండిన పేడలో పోషకాల శాతం పరిశీలిస్తే నత్రజని 1.74 శాతం, పాస్ఫేట్ 1.7, పొటాష్ 0.6, కాల్షియం 0.37, మెగ్నీషియం 0.53 శాతం, ఫెర్రస్1400 పీపీఎం, జింక్ 90 పీపీఎం, మాంగనీస్ 210 పీపీఎం, కాపర్ 71 పీపీఎం, బోరాన్ 5పీపీఎం ఉంటాయి. ఆవు మూత్రంలో నత్రజని, సల్ఫర్, అమ్మోనియా వాయువు, కాపర్ పొటాష్, మాంగనీస్, యూరియా, ఉప్పు, బెనిఫిషియల్ యాసిడ్, కాల్షియం, నీరు, ఫెర్రస్, యూరిక్ యాసిడ్, పాస్ఫేట్, సోడియం, కార్బోనిక్ యాసిడ్స్, విటమిన్ ఏ, బీ, సీ, డీ.. ఇతర ఖనిజాలు ఉంటాయి. దేశి ఆవు పేడ, మూత్రం ద్వారా జీవామృతం తయారు చేసి భూమి ఆరోగ్యంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులను పండించొచ్చు. ఒక గ్రాము మట్టిలో 100 కోట్ల జీవరాశులు ఉంటాయి. ఆవు పేడ, మూత్రం ద్వారా జీవరాశిని పెంపొందించొచ్చు.

**ఎరువు తయారు ఇలా..**

ఆవు మూత్రం, పేడ ద్వారా జీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం, అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం వంటివి తయారు చేసి పంటలకు అందించవచ్చు. జీవామృతాన్ని 10 కిలోల ఆవు పేడ, 5 నుంచి 10 లీటర్ల ఆవు మూత్రం, 2 కిలోల నల్లబెల్లం, 2 కిలోల శనగ లేదా ఉలవ లేదా పెసర లేదా మినుము పిండి, 200 లీటర్ల నీరు, దోసెడు ఒడ్డు మన్నుతో తయారు చేయొచ్చు. ఘన జీవామృతాన్ని 100 కిలోల ఆవు పేడ, 5లీటర్ల ఆవు మూత్రం 2కిలోల బెల్లం, 2కిలలో పిండి, అరకిలో ఒండ్రుమట్టితో ఘన జీవామృతాన్ని తయారు చేసుకోవచ్చు. నీమాస్త్రాన్ని 100 లీటర్ల నీరు, ఒక కిలో వేప పిండి లేదా వేప చెక్క పిండి లేదా వేపాకులు, 200 గ్రాముల సర్ఫ్ పొడితో నీమాస్త్రాన్ని తయారు చేయవచ్చు. అగ్నిఅస్త్రాన్ని 20 లీటర్ల గోమూత్రం, 500 గ్రాముల దంచిన పచ్చి మిరపకాయలు, ఒక కిలో దంచిన పొగాకు, 500 గ్రాముల దంచిన ఎల్లిపాయ పేస్టు, కొన్ని వేపాకులతో తయారు చేయొచ్చు. బ్రహ్మాస్త్రాన్ని 3 కిలోలు మెత్తగా నూరిన వేపాకులు, 2 కిలోల బొప్పాయి ఆకులు, 2 కిలోల ఆముదం ఆకులు, 2 కిలోల కానుగ ఆకులు, 20 లీటర్ల దేశీ ఆవు మూత్రంతో తయారు చేసుకోవచ్చు.

**38 రకాల దేశవాళీ ఆవులు**

ఇక్కరెడ్డిగూడలోని యువ రైతు చంద్రశేఖర్ రెడ్డి తనకున్న పదెకరాల్లో మొక్కజొన్న, టమాట, మిర్చి, క్యారెట్, బీట్‌రూట్ తదితర పంటలను సాగుచేస్తున్నాడు. ఇతను పంటలకు రసాయన ఎరువులు, పురుగు మందులను అస్సలు వాడడు. తన వద్ద ఉన్న 38 రకాల దేశవాళీ ఆవుల పేడ, మూత్రంతో ఎరువు తయారు చేసి పంటలకు వేస్తాడు. వీటి వాడకం ద్వారా మట్టిలోని సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని ఈ రైతు చెప్పాడు. అంతేకాక పంట దిగుబడి కూడా బాగా ఉంటుందని తెలిపాడు. దేశవాళీ ఆవులు కంగాయం(తమిళనాడు), ఒంగోలు, పుంగనూరు(ఆంధ్రప్రదేశ్), గిర్(గుజరాత్) తదితర రకాల దేశవాళీ ఆవులతో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాడు.

**ఏడేళ్లుగా వాడుతున్నా...**



దేశవాళీ ఆవులను ఏడేళ్ల క్రితం కొనుగోలు చేశాను. వాటి పేడ, మూత్రాన్ని పంటలకు వాడుతుండటంతో మంచి దిగుబడులు వస్తున్నాయి. పంటలకు రసాయనిక ఎరువులు, మందులను వినియోగించను. ఖర్చు కూడా తక్కువ. రసాయన ఎరువుల వాడక పోవడంతో పర్యావరణానికి మేలు చేస్తున్నాననే తృప్తి ఉంది.

**గణపతి చంద్రశేఖర్‌రెడ్డి, యువ రైతు, ఇక్కరెడ్డిగూడ, చేవెళ్ల మండలం**

## 1010 ఫౌండేషన్ వరి విత్తనాలతో అధిక దిగుబడి

శామీర్‌పేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులు పొలాల్లో కొత్తగా వచ్చిన 1010ఫౌండేషన్ వరి విత్తనాన్ని సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం అలియాబాద్‌లో రైతు ముద్దం సంజీవరెడ్డి క్షేత్రంలో ఏవో రమేశ్ ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. నాణ్యమైన వరి విత్తనాన్ని సాగుచేయాలని చెప్పారు. 1010 సీడ్ సాగులో పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. డీఏవో చంద్రకళ, ఏడీఏ వెంకట్‌రాంరెడ్డిలు కూడా పాల్గొని రైతులకు సూచనలను, సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈవోలు సుధీర్, రవి, నాయకుడు భిక్షపతి, రైతులు పాల్గొన్నారు.


రైతులకు వరి సాగుపై సూచనలిస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాస్


తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు చేపడుతున్న పనులు

## మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం

మేడ్చల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి):మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ఇటీవల కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి డిసెంబరు 9తో రెండేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద నూతన తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మేడ్చల్ కలెక్టరేట్ వద్ద కూడా తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఇందుకు రూ.17లక్షలను వెచ్చిస్తున్నట్లు తెలిసింది. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటును చేస్తున్నారు.

## కన్హా శాంతివనంలో ఆక్రమణ భూముల వివరాలివ్వండి

● తహసీల్దార్‌ను కోరిన బక్కని నర్సింహులు



షాద్‌నగర్ అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నందిగామ మండలం చేగూరు శివారులో ఉన్న కన్హా శాంతివనం అక్రమంగా స్వాధీనపర్చుకున్న భూములపై విచారణ చేసి వివరాలివ్వాలని తహసీల్దార్‌ను కోరినట్టు మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తెలిపారు. శనివారం తహసీల్దార్‌కు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినట్టు తెలిపారు. వ్యవసాయ భూముల్లో వెలిసిన కన్హాశాంతి వనం వందల ఎకరాల్లో విస్తరించి ఉందని పేర్కొన్నారు. ధ్యాన కేంద్రం ఆధీనంలో ఉన్న వ్యవసాయ భూముల్లో అసైన్డ్ భూములతో పాటు గైరాన్, భూదాన్, శిఖం భూములు, చెరువులు, కుంటలు, నక్ష బాటలు ఉన్నాయనే సమాచారం ఉందన్నారు. కన్హా శాంతివన భూములపై సమగ్ర విచారణ చేసి, ప్రభుత్వ భూములుంటే వివరాలివ్వాలని కోరానని బక్కని తెలిపారు.

## ధారూరు జాతరకు భారీగా ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

వికారాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు.శనివారం ధారూరు జాతర ఏర్పాట్లపై కలెక్టర్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ధారూరు జాతర నవంబరు 11 నుంచి 16 వరకు జరుగుతుందన్నారు. జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తారని, అందుకు అనుగుణంగా సదుపాయాలు కల్పించాలని ఆయన తెలిపారు. 24గంటలు సంబంధిత శాఖలు అధికారులు విధుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమన్వయంతో పనిచేస్తూ జాతర సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి, విద్యుత్, సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తుకు సిబ్బందిని సమకూర్చాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఎండబ్ల్యూవో రాజేశ్వరి, జిల్లా పశుసంవర్ధక అధికారి సదానందం, పంచాయతీ రాజ్ ఉమేష్, ఎంపీడీవో నరిసింహులు, జాతర నిర్వాహక కార్యవర్గ సభ్యులు సంజయ్‌కుమార్, డీ.రాజు, కె.మార్క్, ఎంశైలాశ్, పోలీస్, ఆబ్కారీ, ఆరోగ్య, అగ్నిమాపక, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

షాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి షాబాద్‌లో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శనివారంతో 21వ రోజుకు చేరింది. ఈ దీక్షలో షాబాద్ ఆర్ఎంపీలు అంజాద్, అంజనేయులు, వెంకటేష్, నర్సింహులు, ఇమ్రాన్, బాల్‌రాజ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. బీసీలకు రావాల్సిన న్యాయపరమైన రిజర్వేషన్ శాతాన్ని కొందరు కుట్రతో అడ్డుకుంటున్నారని నాయకులు ఆరోపించారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో ఆర్ఎంపీలు, బీసీ నాయకులు


రోడ్డు స్వీపర్ వాహనానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

## సాంకేతికతతో పారిశుధ్య పనులు

● సంపూర్ణ పరిశుభ్రతే లక్ష్యం : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలో సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా యంత్రాలను వినియోగిస్తున్నట్టు ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. రూ.50లక్షలతో కొనుగోలు చేసిన మ్యాన్‌హోల్ క్లీనర్ మిషన్‌ను, 4.5లక్షలతో కొన్న రోడ్డు స్వీపింగ్ సెటప్‌ను శనివారం మున్సిపల్ ఆఫీసు వద్ద ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను మనుషులతో శుభ్రం చేయడం ఇబ్బంది అవుతోందని చెప్పారు. ఇకపై మ్యాన్‌హోల్స్‌లో పూడికను జెట్టింగ్ మిషన్‌తో తీసేందుకు వీలవుతుందన్నారు. రోడ్లను స్వీపింగ్ సెట్టింగ్ యంత్రంతో శుభ్రం చేయిస్తామన్నారు. సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ కోసం అవసరమైన పెద్ద యంత్రాలను సైతం కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజారోగ్యం కోసం మున్సిపాలిటీ చేస్తు న్న కృషికి ప్రజలు సహకరించాలని, బల్దియా సిబ్బంది పారిశుధ్య నిర్వహ ణకు చొరవ చూపాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, డీఈ నరేష్, ఏఈ సాయికిరణ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


తుమ్మలూరులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఒడిశా బృందం

## తుమ్మలూరు అభివృద్ధి అభినందనీయం

● ఒడిశా రాష్ట్ర అధికారులు, ప్రజాప్రతినిధుల బృందం కితాబు

మహేశ్వరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో తెలంగాణలో గ్రామాలు అభివృద్ధి చెందడం అభినందనీయమని ఒడిశా రాష్ట్ర జాజ్‌పూర్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ నళినిప్రభంజన్ అన్నారు. ఆ రాష్ట్ర అధికారులు, ప్రజాప్రతినిధులు నాలుగు రోజుల తెలంగాణ పర్యటనలో భాగంగా శనివారం తుమ్మలూరును సందర్శించారు. గ్రామంలో పర్యటించి వైకుంఠధామం, పల్లెప్రకృతివనం, కంపోస్టుయార్డు వంటి పనులతో పాటు సీసీ రోడ్లు, నీటి సరఫరా, పంచాయతీ ఆదాయ వ్యయాలపై ఎంపీడీవో శైలజను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తుమ్మలూరులో అభివృద్ధి బాగుందని, ఒడిశాలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందేలా అక్కడి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రవీందర్‌రెడ్డి, ఆశిష్, అనీల్ ఒడిశా రాష్ట్ర ప్రతినిధులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


మాట్లాడుతున్న శంకర్‌నాయక్

దుద్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్‌నాయక్ సూచించారు. శనివారం హకీంపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిలబస్, స్లిప్ టెస్టులు, రానున్న వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసే అంశాలపై అధ్యాపకులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## గ్రీన్ సిగ్నల్!

(5వ పేజీ తరువాయి)

గాయాలపాలైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌హెచ్ఏఐ అధికారుల సమక్షంలో సేవ్ బనియన్స్ సంస్థకు చెందిన పర్యావరణవేత్తలతో పలుమార్లు చర్చలు జరిపారు. 765 చెట్లు కాపాడతామని, 150 చెట్లు మాత్రమే రీ లొకేట్ చేస్తామని హామీ ఇవ్వడంతో వాళ్లు కేసు విత్‌డ్రాకు అంగీకరించారు. 80 శాతం చెట్లను పూర్తి స్థాయిలో కాపాడేలా 20శాతం చెట్లను రీలొకేట్ చేసేలా అలైన్‌మెంట్ చేశారు. ఈ మార్పులకు సంబంధించిన పూర్తిస్థాయి రిపోర్టును ఎన్జీటీకి సమర్పించారు. ఏడాదిన్నరలోగా రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలా ఎన్‌హెచ్ఏఐ అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు.

**తొలగిన అడ్డంకులు...**

సీఎం ఆదేశాల మేరకు ఎన్‌హెచ్ఏఐ అధికారుల సమక్షంలో సేవ్‌బనియన్స్ సంస్థకు చెందిన పర్యవరణ వేత్తలతో పలు దఫాల్లో చర్చలు జరపారు. 765చెట్లు కాపాడుతామని, 150 చెట్లు మాత్రమే రీ లొకేట్ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అలైన్‌మెంట్‌లో మార్పురిపోర్టును ఎన్జీటీకి సమర్పించడంతో రోడ్డు విస్తరణ పనులు కొనసాగించవచ్చని చెన్నయ్‌లోని గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు అక్టోబరు 31న గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**మర్రి వృక్షాలకు మరోచోట జీవం...**

హైదరాబాద్-బీజాపూర్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న మర్రి వృక్షాలు మొత్తం 60 మీటర్లకు విస్తరించాల్సి ఉండగా.. సెంట్రల్ మీడియన్ స్థలాన్ని 5 మీటర్లుగా నిర్ణయించారు. ప్రస్తుతం డిజైన్ మార్చి తొలుత ప్రతిపాదించిన సెంట్రల్ మీడియన్‌ను ఇప్పుడు 1.5 మీటర్లకు కుదించారు. ఈ మూడున్నర మీటర్లను ప్రధాన భాగాన్ని కలిపి వృక్షాలకు చేరువ వరకు రోడ్డును విస్తరిస్తారు. వృక్షాల ఆవల మరో వైపు రోడ్డు నిర్మిస్తారు. ప్రధాన రోడ్డుకు మధ్య లో చెట్లు ఉంటాయి. వాహనాలకు ఇబ్బంది ఉండకుండా కొమ్మలను తొలగిస్తారు. 150 వృక్షాల్లో 15 పాడైపోగా 135 చెట్లను రీ లొకేట్ చేస్తారు.

**పనులు దక్కించుకున్న మెఘా ఇంజనీరింగ్ సంస్థ..**

హైదరాబాద్-బీజాపూర్‌రోడ్డు(ఎన్‌హెచ్-163) అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 4 లేన్ల రోడ్డు నిర్మించాల్సి ఉంది. 46కిలో మీటర్లు పొడవు, రూ. 928.41కోట్లతో చేపడుతున్న ఈ పనుల కాంట్రాక్ట్‌ను సాగునీటి ప్రాజెక్టులు ఇతర నిర్మాణ రంగంలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన మెఘా ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ దక్కించుకుంది. రోడ్డు పనుల కోసం 145.42హెక్టార్లు సేకరించాల్సి ఉండగా వంద శాతం పూర్తి చేశారు. భూమి కోల్పోయిన రైతులకు భూ పరిహారం వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేశారు.

**కొనసాగుతున్న బైపాస్ పనులు..**

హైదరాబాద్-బీజాపూర్ రహదారి 46కిలో మీటర్ల పరిధిలో 18అండర్ పాస్ బ్రిడ్జిలను నిర్మిస్తారు. చేవెళ్ల, మొయినాబాద్ ప్రాంతాల్లో బైపాస్ పనులు కొనసాగుతున్నాయి. మొయినాబాద్ వద్ద 4.35కిలో మీటర్ల మేర, చేవెళ్ల వద్ద 6.35కిలో మీటర్ల బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు. వీటి మధ్యలో అండర్ పాస్‌లు నిర్మిస్తున్నారు. రహదారి విస్తరణలో భాగంగా పూడూరు మండలం చిట్టంపల్లి వద్ద టోల్ ప్లాజా ఏర్పాటుకు ఉన్నతాధికారులు నిర్ణయించారు.

**హైవే రోడ్డు విస్తరణ పనులకు మోక్షం..**



నాలుగు లేన్ల రహదారి పనులకు గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టులో అనుకూలంగా తీర్పురావడం సంతోషకరం. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు నిర్మాణం పూర్తయితే రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా ప్రజలతోపాటు కర్నాటకు వెళ్లే ప్రజలకు సమస్య పరిష్కారం కాబోతుంది. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పర్యావరణ వేత్తలతో చర్చలు జరపడం వల్లే రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించింది. ఇప్పటికే చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లో బైపాస్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రత్యేకంగా సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నాం.

- కాలె యాదయ్య, ఎమ్మెల్యే, చేవెళ్ల

## వైభవంగా కార్తీక పూజలు


కల్యాణకామేశ్వరి ఆలయంలో సత్యనారాయణ వ్రతం

ఘట్‌కేసర్,నవంబరు1(ఆంధ్రజ్యోతి):కార్తీక మాస పూజల్లో భాగంగా శివాలయాల్లో భక్తుల రద్దీ కొనసాగుతోంది. పోచారం సర్వమంగళ సమేత స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి, ఘట్‌కేసర్‌లోని శివారెడ్డిగూడలో గల శ్రీదండ్ల గడ్డప్రసన్నాంజనేయాలయం, విశ్వేశ్వర స్వామి ఆలయం, ఎన్‌ఎఫ్‌సీనగర్ శివాలయం, శ్రీరామ కల్యాణకామేశ్వరి ఆలయాల్లో పూజలు చేస్తున్నారు. శనివారం శ్రీరామకల్యాణ కామేశ్వరి నవశక్తి ఆలయంలో నిర్వహించిన సత్యనారాయణస్వామి వ్రతంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డిసంగీత దంపతులు కూర్చున్నారు. అంతకు ముందు శివలింగానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి శివకూమార్‌శర్మ, ప్రసాద్, రాంచందర్‌రెడ్డి కె.చెన్నారెడ్డి, సంజీవరెడ్డి, విరేశం, మహిళలు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరుడి రథోత్సవం..


వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథోత్సవం

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌కు ముఖద్వారంగా వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి రథోత్సవాన్ని నిర్వహించారు. స్వామికి పూజలు చేసిన తరువాత, ఉత్సవ విగ్రహాలను మినీ రథంపై ఉంచి ఆలయ గర్భగుడుల చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధి చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామిపల్లకి సేవను నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసి, ఆలయం చుట్టూ ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహంతో పల్లకి సేవను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

# ఆపద మొక్కుల తల్లి మైసిగండి మైసమ్మ

**ఈ నెల 5 నుంచి ఐదు రోజుల పాటు ఆలయ బ్రహ్మోత్సవాలు**

కడ్తాల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):భక్తి విశ్వాసాల ముక్తి ప్రదాత.. ఆపద మొక్కుల అమ్మ... శక్తి స్వరూపిణి అయిన కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయం బ్రహ్మోత్సవాల(జాతర)కు ముస్తాబైంది. ఏటా ప్రతీ కార్తీక పౌర్ణమి నుంచి కార్తీక పంచమి వరకు ఇక్కడ జాతరను నిర్వహిస్తారు. మైసమ్మ బ్రహ్మోత్సవాలు ఈ నెల 5 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆరు రోజులు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని శోభాయమానంగా అలంకరిస్తున్నారు.

**జాతర ప్రత్యేకత ...**

మైసిగండి జాతర రాష్ట్ర స్థాయిలో ఖ్యాతికెక్కింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల భక్తులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి భారీగా తరలి వస్తారు. ఆలయ ట్రస్టీలు, ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన మైసమ్మ జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు. ఉద్యోగం వచ్చిన వారు, నూతన దంపతులు, వాహనాలు కొన్న సందర్భాల్లో ఇక్కడ పూజలు చేసి బంధుమిత్రులకు భోజనాలు ఏర్పాటు చేస్తారు.


**మతసామరస్యానికి ప్రతీక..**

మైసమ్మ ఆలయం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇక్కడి పూజలు, బ్రహ్మోత్సవాల్లో హిందువులు, ముస్లింలు పాల్గొంటారు. జాతరలో కొన్ని ముస్లిం కుటుంబాలు ఇక్కడ మొక్కులు తీర్చుకుంటాయి. మైసమ్మ ఆలయ వెనకున్న కోనేరు పవిత్రతను సంతరించుకొంది. దీనిలో స్నానమాచరిస్తే రోగాలు పోయి పుణ్యం లభిస్తుందన్నది భక్తుల విశ్వాసం.

**ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు...**

నవంబరు 5 నుంచి పదో తేదీ వరకు కొనసాగే మైసమ్మ జాతరకు వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాన్ని అలంకరిస్తున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీరు, ఇతర వసతులు కల్పిస్తున్నట్టు ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలి పంతూ, ఈవో స్నేహలత తెలిపారు. హైదరాబాద్, కల్వకుర్తి, అచ్చంపేట, దేవరకొండ ప్రాంతాల నుంచి ఆర్టీసీ జాతర సర్వీసులు నడుపుతుందని చెప్పారు.




**అర్జిత సేవల ధరలివీ...**

మైసిగండి ఆలయంలో వివిధ సేవల వివరాలను ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వివరించారు. టెంకాయ దర్శనం రూ.10, ప్రత్యేక దర్శనం రూ. 50, పుట్టు వెంట్రుకలు రూ.30, చీర మొక్కుబడి రూ.50, వొడిబియ్యం రూ.100, అంతరాలయ దర్శనం రూ.100, కుంకుమార్చన రూ.200, శివలింగాభిషేకం రూ.500, పెద్దఅమ్మ వారికి అభిషేకం రూ.వెయ్యి, శాశ్వత పూజలు రూ. 5వేలు, నవగ్రహ అభిషేకం రూ.500, సత్యనారాయణ స్వామి వ్రతం రూ.500గా నిర్ధారించారు.

**భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు**



భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. నవంబరు 5న క్షీరాభిషేకం, విశేష అలంకరణలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 10న అమ్మవారికి కూరగాయలతో అలంకరణ, ముగింపు వేడుకలతో ఉత్సవాలు సంపూర్ణం అవుతాయి.

- స్నేహలత, ఆలయ ఈవో

**జాతర కోసం వసతులు కల్పిస్తున్నాం**



మైసిగండి బ్రహ్మోత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నవంబరు 5 నుంచి 10వ తేదీ వరకు కొనసాగే జాతరకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించాం. అన్ని ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు నడపాలని అధికారులను కోరాం. అమ్మవారి దర్శనం కోసం భక్తుకు క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నాం.

- రామావత్ సిరోలిపంతు, ఫౌండర్ ట్రస్టీ

# స్వాప్ కోటా.. అందరికీ వాటా!



(5వ పేజీ తరువాయి)

అక్కడికి బదిలీ చేస్తారు. లేదంటే ఆ మండలంలో ఎక్కడైనా పోస్టింగ్ ఇస్తారు. అయితే జీవో 317 పేరుతో నిబంధనలకు విరుద్ధంగా జీహెచ్ఎంసీ, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చేస్తున్నారు. తద్వారా గ్రామీణ పాఠశాలలకు తీరని అన్యాయం జరుగుతోంది. స్వాప్ పనిచేసే ప్రాంతానికి 60-70కి.మీ దూరంలో పోస్టింగ్ ఇస్తున్నారు. ఇది పూర్తిగా జీవో 317 ఉల్లంఘన కిందికే వస్తుంది. ఇలాంటివి జిల్లాలో కోకొల్లలుగా జరిగాయి. జిల్లాకు కేటాయించబడిన టీచర్ పోస్టుల సంఖ్యకు మించి దాదాపు 500 మంది ఇతర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులకు ఇక్కడ పోస్టింగ్‌లు ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీటి వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తూ ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నాయి.

నల్గొండ, యాదాద్రి, మంచిర్యాల వంటి అనేక జిల్లాల నుంచి 317 జీవో పేరుతో అనేక మంది పైరవీలతో జిల్లాలో దొడ్డిదారిన పోస్టింగ్‌లు పొందిన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎడాపెడా పోస్టింగ్‌లు ఇచ్చేయడం వల్ల ఇక్కడ కేడర్ స్ట్రెంత్ వేకెన్సీలన్నీ ఇపుడు దాదాపు భర్తీ అయ్యాయి. దీంతో కొత్తగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోంది.

## ఉన్నత స్థాయి విచారణ జరపాలి

● సేవ్ టీచర్స్ సంఘ ప్రతినిధుల డిమాండ్

రంగారెడ్డి జిల్లా విద్యాశాఖలో జీవో 317 ద్వారా జరుగుతున్న అక్రమ బదిలీలు, డిప్యుటేషన్లపై తక్షణమే ఉన్నతస్థాయి విచారణ జరపాలని సేవ్(సర్వీస్ అసోసియేషన్ ఫర్ విజనరీ) టీచర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం సంఘ ప్రతినిధులు రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారిందని, ఇందులో పనిచేస్తున్న కొందరు సమాంతర వ్యవస్థను నడుపుతున్నారని విమర్శించారు. డీఈవో అఫీషియల్ వాట్సాప్ గ్రూప్‌లో కూడా వీరే అడ్మిన్‌గా ఉంటూ ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు. అక్రమాలను ప్రశ్నిస్తే డీఈవో ఎలాంటి సమాధానం కూడా ఇవ్వడం లేదన్నారు. బదిలీలపై సమాచారం సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు అడిగితే ఇంత వరకు సరైన సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాలకు అన్యాయం చేసే విధంగా జీవో 317 కింద ఉపాధ్యాయుల బదిలీల్లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, ఉన్న పోస్టుల కంటే అధికంగా జిల్లాలో 500 మంది ఉపాధ్యాయులను ఇతర జిల్లాలను తీసుకువచ్చారని ఆరోపించారు. నల్గొండ, యాదాద్రి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూలు, మంచిర్యాల తదితర జిల్లాల నుంచి అక్రమంగా బదిలీలపై కొందరు వచ్చారని తెలిపారు. చివరకు జిల్లాలో ఖాళీ కొన్ని సబ్జెక్టులకు సంబంధించిన టీచర్ పోస్టులు ఖాళీగా లేకుండా చేశారన్నారు. వీటి వెనుక భారీగా ముడుపులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. అందువల్ల మొత్తం ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. సేవ్ టీచర్స్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు బొడ్డు రవి, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల మధుకర్‌రెడ్డి, తలారి సురేష్‌కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, సేవ్ రంగారెడ్డి నిరుద్యోగ జేఏసీ ప్రతినిధి విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సేవ్ టీచర్స్ సొసైటీ ప్రతినిధులు

## ఇవిగో అక్రమాలు

● అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తొర్రూర్ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ ఇంగ్లీష్, ఎస్ఏ సోషల్ స్టడీస్ పోస్టులు అలాగే ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ పోస్టులు క్యాడర్ స్ట్రెంత్ ప్రకారం ఖాళీగా లేనప్పటికీ అక్కడికి స్వాప్ కేటాయింపులు చేసి జీతభత్యాలు కూడా కొంత మేర చెల్లించారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో చెల్లించిన జీతభత్యాలను తిరిగి చాలనా రూపంలో వెనక్కి తెప్పించారు. దాదాపు 3 నెలల తర్వాత వీరిని వేరే పాఠశాలలకు కేటాయించారు. ఇది కూడా నిబంధనలకు విరుద్ధంగానే జరిగింది. నల్గొండ జిల్లా నుంచి 317 జీవో పేరుతో అక్రమంగా రంగారెడ్డి జిల్లాకు వచ్చిన ఓ ఉపాధ్యాయ సంఘ నేత సరూర్‌నగర్ మండలంలోని ఎన్టీఆర్ నగర్ ఎంపీపీఎస్ స్కూల్‌లో పోస్టింగ్ పొందారు. ఆయన 2024 ప్రమోషన్ ఇచ్చే సందర్భంలో న్యాయస్థానంలో ఆయన ఇచ్చిన అఫిడవిట్‌లో జిల్లాలో జూనియర్ ఉపాధ్యాయుడిగా పేర్కొని ప్రమోషన్ జాబితా నుంచి తన పేరు తొలగించుకున్నారు. అయితే 2025లో మాత్రం ఆయన జిల్లాలో సీనియార్టీ చూపించుకుని ప్రమోషన్ తీసుకొని పక్క మండలంలో పోస్టింగ్ పొందారు.

● జీవో 317 ద్వారా 2021లో నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీపై వెళ్లాల్సిన ఒక స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) జిల్లా విద్యాశాఖ అండదండలతో రంగారెడ్డి జిల్లాలోనే పదవీ విరమణ వరకు కొనసాగారు. రాజేంద్రనగర్‌లో పనిచేస్తున్న అతనిపై కొందరు ఫిర్యాదు చేయడంతో పదవీ విరమణకు కేవలం 5 రోజుల ముందు అంటే ఆయన 2025 ఏప్రిల్ 25న మ్యూచ్‌వల్ బదిలీల్లో ఆయన్ని వికారాబాద్‌కు పంపారు. 2025 ఏప్రిల్ 25న ఆయన వికారాబాద్ వెళ్లి అక్కడే పదవీ విరమణ పొందాడు. ఆయనపై ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

● అలాగే స్వాప్ కోటాలో తలకొండపల్లిలో ఖానాపూర్ పాఠశాలకు బదిలీ చేసిన టీచర్ విషయంలోనూ అనేక తప్పిదాలు చేశారు. ఈ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) పోస్టు ఒక్కటే ఉన్నప్పటికీ ఇదేమీ పట్టించుకోకుండా ఇక్కడ పోస్టింగ్ ఇచ్చిన ఉపాధ్యాయురాలును పట్టణ ప్రాంతమైన సరూర్ నగర్ మండలం రాజీవ్‌గాంధీ నగర్ పాఠశాలకు బదిలీ చేయడం గమనార్హం. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం జరుగుతోంది. ఇక సాధారణ బదిలీల్లో స్పౌజ్ పాయింట్లు, మెడికల్ పత్రాల వినియోగంలో జరుగుతున్న అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా విద్యాశాఖ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వివరాలన్నీ బయటకు రావాలంటే తక్షణమే జీవో 317 ద్వారా జరిగిన కేటాయింపుల జాబితాలు బహిర్గత పరచాల్సిన అవసరం ఉంది. పదోన్నతుల జాబితాలు తప్పుల తడకలుగా తయారుచేసి అనర్హులకు పదోన్నతులు ఇచ్చారు. వీటిపై డీఈవో సుశీంద్రరావును వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

# విపక్షాల కుట్రలు ఫలించవు


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాభిమానం ముందు విపక్షాల కుట్రలు ఫలించవని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, పేదల ప్రగతి సాధ్యం అన్నారు. కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నాయకులతో కలిసి ఎమ్మెల్యే శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌ను గెలిపిస్తే జూబ్లీహిల్స్ ప్రాంత పేదల కష్టాలన్నీ తీరతాయని హామీ ఇచ్చారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ఉంటే ప్రజల అవసరాలు తీరుతాయని, గత బీఆర్ఎస్ పాలనలో ఆర్భాటమే తప్ప ప్రగతి లేదన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మండ్లీ రాములు, శ్రీనివాస్‌రెడ్డి, బీక్యానాయక్, హన్మనాయక్, మాడ్గుల విజయ డెయిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, సురేందర్‌రెడ్డి, ఫరీద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**నవీన్‌యాదవ్ గెలుపుతో పాలమూరు బిడ్డ రేవంత్‌రెడ్డికి బలం**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్‌యాదవ్ గెలుపు ద్వారా పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డికి బలం చేకూరుతుందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ప్రాంతంలో నివసించే పాలమూరు ఓటర్లు ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో జిల్లా నాయకులతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. అభివృద్ధిని కాంక్షించి ఉప ఎన్నికలో ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టం కట్టాలన్నారు. అవకాశవాద పార్టీలను నమ్మి మోసపోవద్దని కోరారు.ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డే సీఎంగా ఉన్నందున ఉపాధి కోసం వచ్చిన పేదలకు మేలు జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో జూబ్లీహిల్స్ నిర్లక్ష్యానికి గురైందన్నారు. జూబ్లీహిల్స్ ప్రాంతంలో పాలమూరు వాసులు వేలాది మంది ఉన్నారని, వారంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలుకుతున్నారని కసిరెడ్డి అన్నారు. సమావేశంలో నాయకులు సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, అంజన్‌రెడ్డి, రమేశ్, మల్లయ్య, జవహర్‌లాల్, శ్రీరాములు, తులసీరామ్, హీరాసింగ్,యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

**హరీశ్‌రావును పరామర్శించిన కసిరెడ్డి**

సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతిపట్ల ఎమ్మెల్యే కసిరెడ్డి సంతాపం తెలిపారు. హైదరాబాద్‌లోని హరీశ్ నివాసంలో పరామర్శించారు. సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో సురేందర్‌రెడ్డి, సురభి వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

## ఇండియా టీవీలో మూన్‌వాకర్ డాక్యుమెంటరీ



టీవీలో వంశీకృష్ణ డాక్యుమెంటరీ

తాండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వీఐపీ వంశీకృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. కళారంగంలో సాధించిన అంతర్జాతీయ, జాతీయ రికార్డులకుగాను జాతీయ మీడియా చానల్ ఇండియా టీవీలో శనివారం అతడిపై డాక్యుమెంటరీ ప్రసారమైంది. వంశీ బాల్యం, విద్యాభ్యాసం తదితర విషయాలను ప్రసారం చేశారు. వంశీ 2015లో మైకల్ జాక్సన్ జయంతి సందర్భంగా మూన్ వాకింగ్‌లో ప్రపంచ రికార్డును, 2016లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సంపాదించాడు. 2015లో ఢిల్లీ సిరిపోట్ ఆడిటోరియంలో రికార్డుల ప్రతినిధులతో అంతర్జాతీయ వీఐపీ హోదాను, 2019లో ర్యాప్ సింగింగ్ 315 పదాలు ఏకధాటిగా పాడి రికార్డు సాధించారు. గరుడాసన యోగా 5 నిమిషాలు 19 సెకన్లు చేసి రికార్డు సృష్టించారు. పాస్టస్ట్ డబుల్ నాంచాకు(కరాటే ఆయుధం) నిమిషంలో 218 సార్లు తిప్పి రికార్డు సృష్టించాడు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

తాండూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం తాండూరులోని అంబేద్కర్ చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. 1994-2008లో ఆర్.కృష్ణయ్య చేసిన ఉద్యమ ఫలితంగానే ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ విధానాన్ని తెచ్చిందని చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లింపులో అలస్యం చేయడం వల్ల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు షుకూర్, వెంకటేష్, అనిత, మంజుల, నర్సమ్మ, విజయలక్ష్మి, వీరమణి, చెన్నారం లక్ష్మన్ చారీ, బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.


తాండూరులో ధర్నా నిర్వహిస్తున్న బీసీ సంఘం నాయకులు

## తాండూరు ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐగా రాణి



తాండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐగా రాణి బాధ్యతలు స్వీకరించారు. కొడంగల్ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న ఆమె శనివారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ సీఐగా పనిచేసిన ఆదిశేషిరెడ్డి గ్రూప్-1లో అర్హత సాధించి డీఎస్పీగా ఎంపికయ్యారు. దీంతో ఇక్కడ నుంచి రిలీవ్ అయ్యారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ మీనాక్షి

వికారాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ మీనాక్షి అన్నారు. పట్టణంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో శనివారం షీటీమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. షీటీమ్ మహిళల రక్షణ కోసం పనిచేస్తోందన్నారు. సైబర్ క్రైమ్ వివరాలు తెలిపేందుకు 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫాతిమా, షీ టీమ్ ఇన్‌చార్జి బుచేందర్‌రెడ్డి, రేష్మా, కళాజాత ఇన్‌చార్జి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థలను తరలించొద్దు



నిరసన దీక్షలో జేఏసీ నాయకులు

కొడంగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించకుండా కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ నాయకురాలు నర్మదా కిష్టప్ప, డాక్టర్ కే.వెంకటేశ్వర్లు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేశ్‌బాబు, బుస్స చంద్రయ్య, నర్మదా కిష్టప్ప, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎంపీపీ వివాహ వార్షికోత్సవం



మాజీ ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మండల మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి 33వ వివాహ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. గౌడవెల్లి సాకేత్‌లోని మాజీ ఎంపీపీ నివాసంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు మాజీ ఎంపీపీ పద్మ జగన్‌రెడ్డి దంపతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోమారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజు, సుదర్శన్‌రెడ్డి, జంగారెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి, ప్రదీప్‌సింగ్, బీఆర్ఎస్ మేడ్చల్ మున్సిపల్ ఉపాధ్యక్షుడు మెరుగు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దుద్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలను కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తాండూరు ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ రాజేశ్వర్‌రెడ్డి, మధుశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ఏర్పాటు చేసిన రైతు శిక్షణ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. పంట సస్యరక్షణ చర్యలపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఏఈవో భావన, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌ను తరిమికొట్టాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : సమాజం నుంచి ఎయిడ్స్‌ను తరిమి కొట్టాలని జిల్లా ఎయిడ్స్ నివారణ అండ్ నియంత్రణ విభాగం అధికారి డాకర్ శ్రీదేవి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ అనురాగ్ సంయుక్తంగా హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఫణిందర్, సంజీవ, దుర్గశ్రీనివాస్, గణేష్, డీన్‌లు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు అవార్డు

కీసర, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ఐకేఏ-2025(హైద్రాబాద్) అవార్డు సొంతం చేసుకుంది. ఈ మేరకు ఎల్డ్రాక్ ఇండియా కె-12 అవార్డ్సు ఆర్గనైజేషన్ వారు ఆయా విభాగాల్లో సర్వేలో నేటి అవసరాలకు అనుగుణంగా సాంస్కృతిక, శాస్త్ర సాంకేతిక విద్యా విధానాన్ని మోటోగా స్వీకరించారు. ఈ మేరకు రాష్ట్రంలోని సీబీఎస్ఈ పాఠశాలల్లో ఎక్సలెన్స్ ఇన్ ప్రమోటింగ్ అఫర్డేబుల్ ఎడ్యుకేషన్ ఫర్ ఎన్‌హాన్సింగ్ సోషల్ ఈక్విటీ విభాగంలో జూబీహిల్స్ పబ్లిక్ స్కూల్ ఐకేఏ-2025 అవార్డు సొంతం చేసుకుంది. నగరంలో శుక్రవారం నిర్వహించిన ఎల్డ్రాక్ ఇండియా కె-12 సమ్మిట్ కార్యక్రమంలో ధరణీ సీఈవో ఫర్టడోస్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ ఫౌండర్ చేతుల మీదుగా ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రెసిడెంట్ మురళీముకుంద్ ఉపాధ్యాయవర్గాన్ని అభినందిస్తూ శనివారం హర్షం వ్యక్తం చేశారు.

## తహసీల్దార్‌కు సన్మానం

శామీర్‌పేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వచ్చి మూడుచింతలపల్లి మండల కొత్త తహసీల్దార్‌గా బాధ్యతలను చేపట్టిన సుచరితను శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సన్మానించారు. మూడుచింతలపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ర్యాకల శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు వంగ లక్ష్మారెడ్డి, రాజేందర్‌ప్రసాద్, హరిహరదేవాలయ కమిటీ సభ్యులు మేడిపల్లి బాల్‌రాజ్ తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## కంప్యూటర్ ఆధారిత విద్య ఎంతో అవసరం

పూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత విద్య నేటి కాలంలో ఎంతో అవసరమని పూడూరు మండల విద్యాధికారి సాయిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మంచన్‌పల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఇన్ఫోసిస్ కంపెనీ వారు పది కంప్యూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సాయిరెడ్డి, ఎంపీడీవో పాండు మాట్లాడుతూ ఇన్ఫోసిస్ కంపెనీ వారు కంప్యూటర్లు అందించడం సంతోషకరమన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ బాలయ్య మృతి

నవాబుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అక్నాపూర్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ బాలయ్య (48) మృతిచెందాడు. శుక్రవారం సాయంత్రం పొలానికి వెళ్తున్నాని బయలుదేరి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలానికి వెళ్లిచూడగా బాలయ్య మృతిచెంది ఉన్నాడు. ఆయన గుండెపోటుతో మృతిచెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# కురుమలకు అండగా ఉంటాం



శాసనసభ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి గొంగడి కప్పి మేకపిల్లను బహూకరిస్తున్న సంఘం నాయకులు

తాండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కురుమలకు అండగా ఉంటామని శాసనసభ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. తాండూరు- హైదరాబాద్ రోడ్డు మార్గంలో శనివారం బీరప్ప దేవాలయాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షుడు మల్లేశం, తాండూరు కురుమ సంఘం డివిజన్ గౌరవ అధ్యక్షులు న్యాయవాది గోపాల్, ఉపాధ్యక్షులు పూజారి పాండు, మహిపాల్, రవి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### పెరటి కోళ్ల పంపిణీ

తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా తాండూరు మహిళా సంఘాల సభ్యులకు శనివారం పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి 950 పెరటి కోడి పిల్లల యూనిట్లను అందించారు. అనంతరం పెద్దేముల్ మండలానికి చెందిన 21మంది లబ్ధిదారులకు రూ.21లక్షల 2వేలా 436 విలువ గల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మల్లేశం, తదితరులు ఉన్నారు.

## కాలనీ సమస్యలు తీర్చరా?



విహారి కాలనీలోని రోడ్లపై ఏర్పడిన గుంతలను చూపుతున్న కాలనీవాసులు

ఘట్‌కేసర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో సమస్యలు తీరేదెన్నడని విహారి కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు శనివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ కాలనీలో సమస్యలు తీరడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలోని అంతర్గత రోడ్లు మోకాలులోతు గుంతలు ఏర్పడి నిత్యం నరకయాతన అనుభవిస్తున్నామని వాపోయారు. ఐదు రోజుల క్రితం వర్షం కురిసినప్పటికీ గుంతలో నీరు ఏమాత్రం తగ్గకపోవడంతోనే తమ బాధలు వర్ణనాతీతంగా మారాయన్నారు. నీటి గుంతలోపడి పలువురు గాయాలపాలయ్యారని నిత్యం ఏప్రమాదం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. అదేవిధంగా కుక్కల బెడద తీవ్రమైందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, ఎంపీ, మున్సిపల్ కమిషనర్ స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేదంటే ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొక్కు ప్రభాకర్, కాలనీవాసులు ధరియాసింగ్ నాయక్, బాల్‌రాజ్ పాలొన్నారు.

# సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్‌చౌదరి

యాలాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి అన్నారు. యాలాల తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలు రికార్డులను ఆయన పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్, భూభారతి నిధులపై తహసీల్దార్ వెంకటస్వామితో చర్చించారు. ఫైల్స్ పెండింగ్‌లో లేకుండా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు.

# మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

● విద్యార్థిని కొట్టిన ఘటనపై విచారణ



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులను పీఈటీ టీచర్ కొట్టిన ఘటనపై అధికారులు స్పందించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల గదులు, డార్మెంటరీ, కిచెన్‌లను పరిశీలించారు. విద్యార్థులను కొట్టిన కారణాలను, విద్యార్థులు పాఠశాల వదిలి వెళ్లడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు మందలించారు. ఈ ఘటనకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## పింఛన్ కోసం పడిగాపులు



పింఛన్ కోసం వేచియున్న వృద్ధులు

మర్పల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతీ నెల పింఛన్ డబ్బులు మొదటి వారంలో పోస్టాఫీస్‌కు అందించగా సకాలంలో పంపిణీ చేయకపోవడంతో ఆసరా పింఛన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పంచాయతీ కార్యాలయం వద్ద సాయంత్రం వరకు వేచి ఉన్నా కొంత మందికే ఇచ్చి తిరిగి రేపు రావాలని చెప్పడంతో అవస్థలు తప్పడం లేదంటున్నారు. ఇప్పటికైనా సకాలంలో అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు కోరుతున్నారు.

### చీఫ్‌విప్ పరామర్శ

బషీరాబాద్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న బషీరాబాద్ మాజీ సర్పంచ్ భర్త శ్రావణ్‌కుమార్‌ను ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్.పి.మహేందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. సికింద్రాబాద్‌లో కిమ్స్ ఆసుపత్రికి చేరుకున్న ఆయన అక్కడి వైద్యులతో శ్రావణ్‌కుమార్‌కు వైద్యం అందిస్తున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు.

### ఒకే ఇంటి నంబర్ ఇవ్వాలి

ఘట్‌కేసర్: ఒక కుటుంబానికి ఒకే ఇంటి నంబర్ ఇవ్వాలని పోచారం మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో శనివారం సమావేశమయ్యారు. కుటుంబంలోని యజమాని, కొడుకు, కోడలు, మనవళ్లు, మనవరాళ్లను ఒకే బ్లాక్‌లోకి తీసుకురావాలన్నారు.

## బల్దియాకు చేరిన ఆటోలు, ట్రాక్టర్లు



మున్సిపాలిటీ వద్ద ఆటోలు, ట్రాక్టర్లు

తాండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తాండూరు మున్సిపాలిటీకి సంబంధించిన పలు రకాల వాహనాలు గత రెండు రోజులుగా కార్యాలయానికి చేరుకుంటున్నాయి. చెత్త సేకరణకు ఉపయోగించే ట్రాక్టర్లు, ఆటోలు రెండేళ్లుగా ఎక్కడబడితే అక్కడ వదిలేశారు. దీంతో వాటిని వెంటనే కార్యాలయానికి రప్పించాలని కమిషనర్ యాదగిరి సిబ్బందిని ఆదేశించారు. దీంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు రోడ్లపై, మెకానిక్ షెడ్లలో మరమ్మతుల పేరిట షెడ్లకే పరిమితమైన 11వాహనాలను కార్యాలయానికి చేర్చారు. అదనపు కలెక్టర్ అనుమతితో వాహనాలకు మరమ్మతులు చేయనున్నట్లు వెల్లడించారు.

## నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

కొడంగల్ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని జ్యోతిబాఫూలే గురుకుల బాలుర పాఠశాల పిన్సిపాల్ కె. నగేష్ అన్నారు. పాఠశాలలో శనివారం మాక్ ఎన్నికలు నిర్వహించి పార్లమెంట్ ఎన్నికలపై విద్యార్థులకు అవగాహ న కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ పనుల పరిశీలన

దుద్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన మండల సమీకృత భవన నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ ఏఈ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య శనివారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఖలీల్‌పాష, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతులు చేపట్టాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మేడ్చల్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) వర్షాల కారణంగా గుంతలమయంగా మారిన మేడ్చల్‌లోని 44వ నంబర్ జాతీయ రహదారిని వెంటనే మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకులు శుక్రవారం మేడ్చల్ రహదారిపై నిరసన తెలిపారు. రహదారిపై నిర్మిస్తున్న వంతెన పనులను త్వరగా పూర్తి చేయటంతో పాటు ఇటీవల వర్షాల కారణంగా గుంతల మయంగా మారిన రోడ్డును పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలన్నారు. ఈ నిరసనలో సురేష్, డి.నర్సింగ్ రావు, కొమరయ్య పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కొడంగల్ రూరల్/దౌల్తాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం సహాయనిధి వరమని కాంగ్రెస్ ఉడిమేశ్వరం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనివాస్ అన్నారు. గ్రామానికి చెందిన కొత్తూర్ చిన్నప్ప, గండి మల్కప్పలకు శనివారం రూ.90వేలు, రూ.31వేలు విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాసప్ప, జనార్దన్, లక్ష్మప్ప, నరేందర్, సయ్యద్‌పాష, మహేష్, అంజిలయ్య గౌడ్, సాయిలు పాల్గొన్నారు. అదేవిధంగా . దౌల్తాబాద్ మండలంలోని చెల్లాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి హర్షవర్ధన్‌కు మంజూరైన సీఎం సహాయ నిధి రూ.60వేల చెక్కును మాజీ ఎంపీపీ పటేల్ విజయ్‌కుమార్ అందజేశారు.

## పనులు నాణ్యతగా చేపట్టాలి

మేడ్చల్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.రవికుమార్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులను శనివారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాల పాటించే విషయంలో రాజీ పడకుండా పనులు చేపట్టాలన్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

## సంక్షిప్తంగా..

### విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

దుద్యాల: యూత్‌ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, హకీంపేట్, హస్నాబాద్, కుదురుమళ్ల పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ఎంఈవో విజయరామారావు, టీవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్ శనివారం ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.

### సైబర్‌నేరాలపై అవగాహన

దుద్యాల: హకీంపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెడ్ కానిస్టేబుల్ యాదయ్య శనివారం విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శంకర్, కృష్ణ, అమృత, అధ్యాపకులు పాల్గొన్నారు.

### కంప్యూటర్ ఆధారిత విద్య ఎంతో అవసరం

దోమ: కంప్యూటర్ ఆధారిత విద్య నేటి సమాజంలో ఎంతో అవసరమని ఎంఈవో వెంకట్ అన్నారు. పోతిరెడ్డిపల్లి పీహెచ్‌సీలో శనివారం ఇన్ఫోసిస్ హైదరాబాద్ ప్రతినిధి వంశీకృష్ణకు అభినందనలు తెలుపుతూ సమావేశం ఏర్పాటు చేశారు. పోతిరెడ్డిపల్లిలోని పాఠశాలకు కంప్యూటర్‌లను అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు చొరవ చూపిన హెచ్ఎం రాజశేఖర్‌ను అభినందించారు.

### విదేశీ కలుపు మొక్కలను నిర్మూలించాలి

తాండూరు: ఈకో ఫాన్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం విదేశీ కలుపు మొక్కల నిర్మూలనపై అవగాహన కల్పించారు. పట్టణ వీధుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, అటవీ అధికారి శ్రీదేవి, న్యాయవాదులు చంద్రశేఖర్, జిలాని, ఈకో ఫాన్ సొసైటి కార్యనిర్వాహణ అధికారి మెట్టు సాయి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

పెద్దేముల్: కందనెల్లిలో రెండు రోజుల కిందట కురవ సాతప్పకు చెందిన 53గొర్రెలు కుక్కల దాడిలో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్య, స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలు గ్రామానికి వెళ్లి పరామర్శించారు. మంత్రి వాకిటి శ్రీహరికి ఫోన్ చేయగా ప్రభుత్వ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా ప్రభుత్వ విప్ రూ.10వేలు, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రూ.25వేలు అందజేశారు. అదేవిధంగా త్వరలో కురువ సంఘం తరపున మరో రూ.50వేలు అందజేస్తామని ప్రభుత్వ విప్ హామీ ఇచ్చారు.

### అవినీతి రహిత భారతాన్ని నిర్మించాలి

ఘట్‌కేసర్ రూరల్: అవినీతి రహిత భారతదేశాన్ని నిర్మించడానికి యువత ముందుకు రావాలని రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ (బుద్వేల్) కళాశాలలో శనివారం విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా 2కే రన్ నిర్వహించారు.

### బీజేపీ నాయకుల అరెస్టు

పరిగి: జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచార సభలో సీఎం రేవంత్‌రెడ్డి సైనికులను కించపరిచేవిధంగా వాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి సిద్ధమవగా పోలీసులు వారిని అరెస్టు చేశారు.

### రైతులకు పరిహారం అందించాలి

పరిగి: తుపాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని తెలంగాణ కిసాన్ సంఘం అధ్యక్షుడు అందె విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంలో శనివారం మక్కల కొనుగోలు కేంద్రాన్ని మర్పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ బండ విష్ణువర్ధన్‌రెడ్డిలు డీసీవో నాగరాజ్‌తో కలిసి ప్రారంభించారు.

### సీఎస్‌సీ కేంద్రం..

మోమిన్‌పేట్: సొసైటీ ఆధ్వర్యంలో సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్)ను మర్పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ బండ విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీవో నాగరాజు శనివారం కార్యాలయంలో ప్రారంభించారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

మోమిన్‌పేట్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఎంపీడీవో సృజన సాహిత్య అన్నారు. ఎన్కతల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, నర్సరీ, పాఠశాలను శనివారం సందర్శించారు.

### డ్రైనేజీ పైపుల తరలింపు.. కాలనీవాసుల వాగ్వాదం

మేడ్చల్ టౌన్: ఇందిరానగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్లు ఏర్పాటు చేయడానికి తీసుకొచ్చిన పైపులను పనులు చేపట్టకుండానే మున్సిపల్ సిబ్బంది తిరిగి తీసుళ్తుండటాన్ని గమనించిన కాలనీ వాసులు వాగ్వాదానికి దిగారు. వాహనంలో ఎక్కించిన పైప్‌లను కిందికి దించారు.

### అలుగురాళ్ల తొలగింపు.. నీరు వృథా

దుద్యాల: పోలెపల్లి చెరువు అలుగుకు ఉన్న రాళ్లను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. దీంతో చెరువులో నుంచి నీరు వృథాగా పోతోందని రైతులు వాపోయారు. ఇలాగే నీరు వెళ్తే చెరువులో నీటి మట్టం తగ్గే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించాలని కోరారు.

## క్రైం కార్నర్

## అంగన్‌వాడీ కేంద్రంలో బాలిక అస్వస్థతపై విచారణ



వివరాలు సేకరిస్తున్న సీడీపీవో, సూపర్‌వైజర్

దుద్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాబాద్ హరిజన్ వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ప్యారాసిటమల్ మాత్రలు మింగి కృతినైన అనే బాలిక అస్వస్థతకు గురైంది. అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తన కూతురు కృతినైన ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిందని బాలిక తండ్రి సాయికుమార్ ఆరోపించాడు. ఈ ఘటనకు సంబంధించి ఐసీడీఎస్ జిల్లా పీడీ కృష్ణవేణి ఆదేశానుసారం శనివారం కొడంగల్ సీడీపీవో రూప, క్లస్టర్ సూపర్‌వైజర్ ప్రభ హస్నాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. బాలిక అస్వస్థతకు గురైన సంఘటనపై వివరాలు సేకరించారు. కేంద్రంలో బాలిక కృతినైనకు మాత్రలు ఇచ్చిన తోటి బాలుడిని పిలిపించి మాట్లాడారు. కేంద్రానికి వచ్చే పిల్లలు ఇళ్లకు వెళ్లేంత వరకు సంరక్షించాలని అంగన్‌వాడీ టీచర్, ఆయాను హెచ్చరించారు. అనంతరం నారాయణపేట జిల్లా కోస్గిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించి కుటుంబసభ్యులతో మాట్లాడారు. బాలిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, జిల్లా ఉన్నతాధికారులకు బాలిక అస్వస్థతకు గురైన సంఘటనపై వైద్యుల రిపోర్టును అందిస్తామని వారు తెలిపారు.

## హైటెన్షన్ విద్యుత్ తీగలను పట్టుకుని..

● గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపేట మున్సిపాలిటీ ఖాసీంబాయ్ తాండా పరిధిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి 220 కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలను పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓ గుర్తుతెలియని వ్యక్తి గ్రామ శివారులో ఉన్న హైటెన్షన్ స్తంభం పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ రెండు గంటల పాటు హల్‌చల్ చేశాడు. స్థానికులు ఎంత సముదాయించినా అతడు వినిపించుకోకుండా విద్యుత్ టవర్ ఎక్కి 220 కేవీ హైటెన్షన్ తీగను పట్టుకున్నాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. స్థానికంగా ఉన్న ఇటుక బట్టీల్లో పనిచేసే ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికుడిగా స్థానికులు అనుమానిస్తున్నారు. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

బొంరాస్‌పేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంకిమెట్ల గ్రామానికి చెందిన చాకలి సంగమేశ్వర్ హైదరాబాద్‌లో ఉద్యోగ రీత్యా జీవనం కొనసాగిస్తున్నాడు. గతనెల 27న గ్రామంలోని తన ఇంటి తాళాలు విరగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గుర్తించాడు. బీరువాలో ఉన్న 10తులాల వెండి, రూ.15వేలు నగదు కనిపించకపోవడంతో శనివారం బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాల వెంకటరమణ తెలిపారు.

## బైక్ అప్పగింత

దుద్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం ఎదుట రెండు వారాలుగా ఓబైక్ ఉండగా గమనించిన గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు సేకరించిన పోలీసులు మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని కారుకొండ గ్రామానికి చెందిన అశోక్‌దిగా గుర్తించారు. దీంతో శనివారం అశోక్ వివరాలు తెలుసుకొని బైక్ అప్పగించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కృష్ణ పాల్గొన్నారు.

## పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

బషీరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నుమాన్ అలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెడ్డిఘణాపూర్ గ్రామంలోని ఓ దుకాణంలో పేకాడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ పేకాడుతున్న నర్సింహులు, అంజిలయ్య, మహబూబ్, పకీరప్ప, ఎల్లప్పలను పట్టుకున్నారు. వారివద్ద నుంచి రూ.5వేల పైచిలుకు నగదు, పేకాట ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ట్రాలీఆటోను ఢీకొన్న ట్రాక్టర్

● పలువురికి గాయాలు

యాలాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి ఓ ట్రాలీ ఆటో మండల పరిధిలోని అగ్గనూరు నుంచి వీరశెట్టిపల్లివైపు వస్తోంది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న డ్రైవర్ పిరంగి మల్లేశంకు తీవ్రగాయాలయ్యాయి. మరో వ్యక్తి గుడిసె నాగప్పతోపాటు ఆటోలో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్‌ను అక్కడే వదిలేసి పారిపోయాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తూ కారును తప్పించబోయి పడటంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన పూడూరు మండల పరిధిలో జరిగింది. చెన్‌గోముల్ ఎస్ఐ భరత్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎత్రాచుపల్లికి చెందిన నగేష్ బైక్‌పై శనివారం పూడూరు మండల పరిధిలోని బీజాపూర్-హైదరాబాద్ జాతీయ రహదారిపై వెళుతున్నాడు. క్రమంలో కారును తప్పించబోయి బైక్‌పై నుంచి పడిపోవడంతో గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడిని పరిగిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నగేశ్ తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## షెడ్డు నిర్మించిన వారికి నోటీసు

ధారూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఆధీనంలో ఉన్న క్రీడాప్రాంగణం స్థలాన్ని ఆక్రమించి దర్జాగా షెడ్డు నిర్మించిన ఆక్రమణదారుకు శనివారం పంచాయతీ కార్యదర్శి భవానీ నోటీసు జారీ చేశారు. సర్వేనంబరు 10లో 20గుంటల స్థలాన్ని గత ప్రభుత్వం హయాంలో క్రీడాప్రాంగణానికి కేటాయించగా మేడిపల్లి పద్మమ్మ క్రీడాప్రాంగణంలోని కొంతస్థలాన్ని ఆక్రమించి షెడ్డు నిర్మించుకున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి భవానీ కబ్జా స్థలాన్ని వదిలేసి ఆక్రమంగా నిర్మించిన షెడ్డు తొలగించాలని లేని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు పద్మమ్మకు కార్యదర్శి నోటీసు అందజేశారు. పోలీసులకు సోమవారం(రేపు) ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## బీసీ సంఘాల నాయకుల అరెస్ట్

పరిగి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు ముకుంద నాగేశ్వర్‌ను శనివారం పరిగి పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ సాధనకు పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలేనిరాహార దీక్ష చేపట్టాలని నాగేశ్వర్ నిర్ణయించారు. దీక్షకు పోలీసుల అనుమతి ఇవ్వకపోగా ముందస్తుగా నాగేశ్వర్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.